ఆస్పత్రి భవన నిర్మాణాలకు గ్రహణం

- ఎస్.కోట నియోజకవర్గంలో అర్ధంతరంగా నిలిచిన పీహెచ్‌సీల భవన నిర్మాణాలు
- గత ప్రభుత్వంలో 5 పీహెచ్‌సీలకు రూ.8.25 కోట్లతో నూతన భవనాలు మంజూరు
- ఎన్నికలకు ముందే జామి, ఎల్.కోటలో 90 శాతానికి పైగా, అలమండ, వియ్యంపేట, కొత్తవలసలో 70 శాతం మేర పనులు పూర్తి
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుకు సాగని మిగిలిన పనులు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది


జామిలో విద్యుద్దీకరణ పనులు పూర్తికాని పీహెచ్‌సీ నూతన భవనం

కొత్తవలస: ప్రజారోగ్యానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, అభివృద్ధి చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచింది.అవసరమైన చోట నూతన భవనాలను మంజూరు చేశారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని జామి, ఎల్.కోట అలమండ,వియ్యంపేట, కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో నాడు–నేడులో భాగంగా జగన్ సర్కారు రూ.8.25 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో పీహెచ్‌సీలో రూ.1.65 కోట్లతో అన్ని సదుపాయాలతో కూడిన భవనాల నిర్మాణానికి టెండర్లు పూర్తి కాగా, కాంట్రాక్టర్లు పనులు కూడా ప్రారంభించారు. ఇరుకు గదులు, శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్న పీహెచ్‌సీలకు ఇక కొత్త శోభ రానుందని, అరకొర సౌకర్యాల మధ్య సేవలందిస్తున్న తామంతా మరికొన్ని నెలల్లో కొత్త భవనాల్లోకి అడుగు పెట్టబోతున్నామని సిబ్బంది ఆశ పడ్డారు. అయితే వారికి నిరాశే ఎదురైయింది.భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకుంటున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవన నిర్మాణాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

శరవేగంగా సాగిన నిర్మాణాలకు అడ్డుకట్ట

గత ప్రభుత్వంలో ఆస్పత్రుల భవనాల నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. జామి,లక్కవరపుకోట పీహెచ్‌సీల భవనాలు 90 శాతం పూర్తయ్యాయి. పెయింటిగ్ పనులను సైతం ఎన్నికలకు ముందే పూర్తి చేశారు. కేవలం ప్లంబింగ్, విద్యుద్దీకరణ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అలమండ, వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల భవనాల నిర్మాణం 70శాతంకు పైగా పూర్తయ్యాయి. నిర్మాణాలు శరవేగంగా సాగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో పనులకు ఫుల్ స్టాప్ పడింది.కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా ఈ నిర్మాణాల సంగతి పట్టించుకున్న దాఖలాలే లేవు. కొత్తవలసలో పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతో చెంతనే ఉన్న ఎన్‌జీఓ కార్యాలయంలో, వియ్యంపేటలో పీహెచ్‌సీని గతంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ కోసం వినియోగించిన భవనం లో నిర్వహిస్తున్నారు. ఈ భవనాల్లో సరైన సౌకర్యాలు, మంచాలు లేక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణాలను పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తేవాలని ఆయా పీహెచ్‌సీల పరిధి ప్రజలు కోరుతున్నారు.


ఎన్నికలకు ముందే తొంభై శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయిన ఎల్.కోట పీహెచ్‌సీ భవనం


కొత్తవలసలో అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణం


కొత్తవలసలో తాత్కాలిక భవనంలోని ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

పనులను త్వరగా పూర్తి చేయాలి



ఆస్పత్రుల భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. పనులను పూర్తిచేస్తే గత ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనో, మరే ఇతర కారణమో తెలియదు కానీ నాడు–నేడులో భాగంగా మంజూరైన పీహెచ్‌సీల భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం దారుణం. కొత్తవలస పీహెచ్‌సీ తాత్కాలిక భవనంలో సౌకర్యాలు లేక ఆరుబయట, ఇరుకు గదుల్లో వైద్యసిబ్బంది సేవలందిస్తున్నారు.రోగులు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పనులను పూర్తి చేయించాలి. – పెదిరెడ్ల శ్రీనివాసరావు, కొత్తసుంకరపాలెం, కొత్తవలస మండలం

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



లక్కవరపుకోట, జామి పీహెచ్‌సీల భవన నిర్మాణాలు 90 శాతానికి పైగా, అలమండ, వియ్యంపేట, కొత్తవలసలో 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. సుమారు రూ.2 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిలిచిపోయిన నిర్మాణాలపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. – శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ

క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి విరాళం


ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మణరావుకు నగదు అందజేస్తున్న .శంకరరావు, ఇందు దంపతులు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమానికి మండలంలోని విజయరాంపురం(రేగిడిపేట) గ్రామానికి చెందిన పి.శంకరరావు, ఇందు దంపతులు రూ.10 వేలు విరాళం అందజేశారు. తమ కుమార్తె పుట్టినరోజున పురస్కరించుకుని ఆశ్రమంలో శాశ్వత అన్నదాన నిర్వహణ కోసం విరాళం అందించామని దాతలు చెప్పారు. ఆశ్రమ నిర్వా హకుడు కోట్ల లక్ష్మణరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి పట్టణంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అలాగే ప్రతీ ఆదివారం మాదిరిగానే ఆలయ అర్చకులు ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి పంచామృతాభి షేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి, పూజలు చేసి, భక్తులను దర్శనానికి అనుమతించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జామి: మండల కేంద్రంలోని అల్లువీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ఏ.వి.ఆర్.కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు ఆధ్వర్యంలో మండల కమిటీ నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కొత్తలి వెంకటరావు, అధ్యక్షుడిగా వి.వాసుదేవరావు, సహధ్యక్షులుగా ఐ.వి.రమణ, ఎం.రూపవతి, ప్రధాన కార్యదర్శిగా ఎం.తాతంనాయుడు, కోశాధికారిగా బి.శ్రీధర్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

ఉపాధి లేక వలస బాట


మాట్లాడుతున్న అప్పారావు

గజపతినగరం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూలీలు స్థానికంగా ఉపాధి లభించక పనికోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో ఆరంగంపై ఆధారపడే కూలీలకు పనులు ఉండడం లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ చెప్పుకోతగిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడా చేపట్టలేదన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించకపోవడంతో జిల్లా నుంచి వలస బాట పడుతున్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందన్నారు.

పోటీపరీక్షలకు సన్నద్ధం


పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువత

గజపతినగరం: ప్రభుత్వ ఉద్యోగం సాధనే లక్ష్యంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిరుద్యోగ యువత నిరంతరం పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి యువకులు, యువతులు గ్రంథాలయానికి వచ్చి సాయంత్రం వరకు ఉండి చదువుకుంటున్నారని లైబ్రేరియన్ వై.స్వప్న ఆదివారం తెలిపారు. గ్రంథాలయంలో ఆర్ఆర్‌బీ, డీఎస్సీ, గ్రూప్స్, తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

రామాయణంపై అవగాహన

విజయనగరం రూరల్: రామాయణంపై విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్‌సీఎస్ ట్రస్ట్ సభ్యురాలు గౌరీనిత్య అన్నారు. రామనారాయణం ప్రాంగణంలో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు డిగ్రీ విద్యార్థులకు రామాయణంపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌ను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో రీసెర్చ్ కేంద్ర నిర్వాహకురాలు హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

శివ స్వాముల శ్రమదానం



గుర్లలో శివస్వాములు ఆదివారం శ్రమదానం చేశారు. స్థానిక శివాలయం చుట్టూ ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆలయం వద్ద పూడిక పోయిన మురుగునీటి కాలువను శుభ్రం చేశారు. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఆలయ పరిస ర ప్రాంతాలను శుభ్రం చేశామని గురుస్వాములు నేరడబిల్లి ఈశ్వరరావు, అంబటి లక్ష్మణ్ చెప్పారు. – గుర్ల

కార్తీక వనభోజనాలు



బొడ్డవర గ్రామంలో ఎస్.కోట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కందుకూరి రమేష్, పూసర్ల రవికుమార్ నేతృత్వంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరికి ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేకపూజలు చేసి నోములు నోచుకున్నారు. అయ్యప్ప మాలధారణ భక్తుల కు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వందలాది మంది ఆర్యవైశ్య కుటుంబాల సభ్యులు సామూహిక భోజనాలు చేశారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. – శృంగవరపుకోట

నిత్యావసర సరుకుల పంపిణీ



కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ శివారు వినాయక్‌నగర్‌కు చెందిన ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్ ఆధ్వర్యంలో 43 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.విశ్రాంత రైల్వే ఉద్యోగి రమణ, వ్యాపారవేత్త గోపి, జనసేన నాయకురాలు రామదుర్గ ఆర్థిక సాయంతో వీటిని పంపిణీ చేశామని ట్రస్టు చైర్మన్ తెలిపారు. – కొత్తవలస

కాశీ విశ్వేశ్వరుడ్ని దర్శించినట్లే..

- గుర్లలో మరో కాశీ..
- శివాలయానికి ఆనుకుని కోనేరు..
- ఎదురుగా శ్మశానవాటిక
- ఆలయ ఆవరణలో కొలువుదీరిని కాలభైరవుడు
- కార్తీకమాసంలో భక్తుల తాకిడి


ఉమా సహిత కోటేశ్వరస్వామి ఆలయం


ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం

గుర్ల: మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వర ఆలయం కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని పోలి ఉంది. గ్రామానికి ఈశాన్యంలో ఉన్న ఈ ఆలయానికి ఉత్తరభాగంలో కోనేరు .. తూర్పున శ్మశానం ఉంది. కాశీ విశ్వేశ్వరుడికి ఏ విధంగా అయితే తూర్పు దిక్కున ఉన్న హరిశ్చంద్ర ఘాట్ నుంచి దహన సంస్కారాల పొగ చేరుతుందో.. అలాగే గుర్ల ఉమారామలింగేశ్వర స్వామికి కూడా శ్మశానం నుంచి పొగ చేరుతుంది. దీంతో ఉమా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే కాశీలోని విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నట్లేనని స్థానికుల విశ్వాసం.

కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు..

గుర్ల శివాలయానికి కార్తీకమాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. కోనేరులో దీపాలు వెలిగించి, అనంతరం ఉమా రామలింగేశ్వరుడిని భక్తులు దర్శించుకుంటారు. అలాగే శివాలయం పక్కనే ఉన్న ఉమాసహిత కోటేశ్వర స్వామి వారిని కూడా దర్శించుకుంటారు.


కాలభైరవుడు విగ్రహం

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

శివాలయాల్లో ఎక్కడా కాలభైరవుడి విగ్రహాలు ఉండవు. కానీ గుర్లలోని ఉమా సహిత కోటేశ్వర ఆలయం నైరుతి భాగంలో కాలభైరవుడి విగ్రహం ఉంది. శివుని దర్శనం తర్వాత కాలభైరవుని దర్శనం చేసుకుంటే సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

నిత్య హోమాలు, రుద్రాభిషేకాలు

కార్తీకమాసంలో ప్రతిరోజూ ఉమా సహిత కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తుంటారు. జిల్లాలోని నలుమూల లు నుంచే కాకుండా మండలంలోని కెల్ల, గుర్ల, గుజ్జింగివలస, గోషాడ, సోలిసిసోమరాజుపేట, చుక్కపేట, పాలవలస, గూడేం, పున్నపురెడ్డిపేట, కోటగండ్రేడు, కలవచర్ల, ఆనందపురం గ్రామాలకు చెందిన భక్తులతో పాటు నెల్లిమర్ల, గరివిడి, గజపతినగరం మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు.


శివాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు

కాశీలో పూజలు చేసినట్లే..



గుర్ల శివాలయంలో పూజలు చేస్తే కాశీలోని విశ్వేశ్వరుడుకి పూజలు చేసినట్లే. కాశీలో ఆలయం ఎలా ఉంటుందో గుర్ల శివాలయ పరిసర ప్రాంతాలు కూడా అలానే ఉంటాయి. కార్తీకమాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంది.
– అరవెల్లి సురేష్‌శర్మ, ఆలయ అర్చకుడు, గుర్ల

విద్యాసామగ్రి, భగవద్గీత పుస్తకాల పంపిణీ

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కె.పార్థసారథి ఆర్థిక సహాయంతో 50మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, భగవద్గీత పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలు, సేవాభావం అలవర్చుకోవాలని, సమాజంపట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గుమ్మడి శ్రీనివాసరావు, గుమ్మడి జగన్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

పొదలు కాదు.. విద్యుత్ స్తంభాలు


వల్లంపూడి బీసీ కాలనీలో..


వల్లంపూడి ఎర్రచెరువు గట్టుపై..

వల్లంపూడి గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఎర్రచెరువు గట్టుపై, బీసీ కాలనీ సమీపంలో పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ స్తంభాలకు పొదలు అల్లుకున్నాయి. వీటి వల్ల తరచూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వీడి గ్రామాల్లో ఇలా విద్యుత్ స్తంభాలపైకి ఎగబాకిన పొదలు, తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.
– వేపాడ

రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం

గంట్యాడ: మండలంలో రెవెన్యూ సిబ్బంది తీరు మారడం లేదు. భూములకు సంబంధించి మ్యుటేషన్లకు అప్రూవల్ ఇవ్వడంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఎవరైనా భూమి కొనుగోలు చేస్తే ఆభూమిని విక్రయించిన వ్యక్తి పేరు నుంచి తమ పేరు మీద మార్చుకునేందుకు మ్యుటేషన్(వన్ బీ, పాస్‌బుక్) కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇందుకోసం భూమి కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రార్ డాక్యుమెంట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసి సచివాలయంలో కానీ, మీసేవలో కానీ దరఖాస్తు చేస్తారు. అదేవిధంగా తల్లిదండ్రులు చనిపోతే వారి వారసులు కూడా భూమిని వారి పేరు మీద మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకుంటారు. మండలంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ 25 వరకు మ్యుటేషన్ కోసం 1,832 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,061 మ్యుటేషన్‌లు మాత్రమే అయ్యాయి. 771 తిరస్కరించారు. మ్యుటేషన్ల తిరస్కరణపై రెవెన్యూ సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, డబ్బులు ఇస్తే కానీ ఫైల్ ముందుకు కదలడం లేదనే పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే వారి మ్యూటేషన్ ఫైల్‌ను ఏదో ఒక కారణం చెప్పి తిరస్కరిస్తున్నట్లు సమాచారం.పైసలు ఇవ్వని ఫైల్‌ను గడువు దాటే వరకు ప్రోసెస్ చేయకుండా వదిలేసి, ఆ తర్వాత తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది.


గంట్యాడ తహసీల్దార్ కార్యాలయం

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి

మ్యుటేషన్లు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయవచ్చు. వివిధ కారణాల వల్ల కొన్ని మ్యుటేషన్లు తిరస్కరించాం.
– పి.నీలకంతేశ్వరరెడ్డి, గంట్యాడ తహసీల్దార్

శతశాతం ట్రేడ్ లైసెన్స్‌లు..


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: నగర పరిధిలో వ్యాపార, వాణిజ్య దుకాణాలకు శతశాతం ట్రేడ్ లైసెన్స్‌ల విధింపే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల విధింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేసేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు, తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఆరుబయట చెత్త వేసిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ వాణిజ్య దుకాణానికి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఇదివరకే ట్రేడ్ లైసెన్సులు పొందిన వారు రెన్యువల్ చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.